క్లుప్తంగా

పరామర్శ



మధుసూదన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఉప సర్పంచ్ కొలూరి మధుసూదన్‌రెడ్డి తండ్రి కొలూరి రామ చంద్రారెడ్డి ఇటీవలే మరణించారు. శుక్రవారం అయ్యపురెడ్డిపల్లె గ్రామంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మధుసూదన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో మంగంపేట గ్రామం విషయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి రాష్ట్ర నాయకులు హేమన్‌వర్మ, కొలూరి నారాయణరెడ్డి, చిన్నిరెడ్డి అశోక్‌రెడ్డి, అంబికా రవి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన పీడీలు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా డీఈఓగా బాధ్యతలు చేపట్టిన శివప్రకాష్‌రెడ్డికి అన్నమయ్య జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల (పీఈటీ) సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. డీఈఓను కలసిన వారిలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, గౌరవాధ్యక్షులు అమర్నాథరెడ్డి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా ప్రెసిడెంట్ లలితమ్మ, ఎస్‌జీఎఫ్ జాయింట్ సెక్రటరీ రెడ్డెయ్య, పీడీలు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ



రఘునాథరెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న ఆయన తనయులు

రాజంపేట : మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ ఏకగ్రీవం అయ్యినందున శుక్రవారం మేడా కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఆర్‌కెఆర్ సంస్థ అధికారులు, సిబ్బంది పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. తమ తండ్రి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన నేపథ్యంలో తనయులు మేడా సాయిరెడ్డి, మేడా రోహిత్ రెడ్డిలు స్వీట్లు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా రాజ్యసభ సభ్యత్వం దక్కించుకున్న మేడా రఘునాథరెడ్డికి పలువురు మంత్రులు, ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు అభినందనలు తెలియజేశారు.

రచయితల బృందానికి ఎంపిక



పీవీఎస్ తేజ

రాజంపేట టౌన్ : పీఎం యువ 2.0 రచయితల బృందానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న పీవీఎస్.తేజ ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. దేశం మొత్తం 41 మంది యువ రచయితలు ఎంపిక కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి తేజ ఒక్కరే ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

నందలూరు(రాజంపేట): మండలంలోని ఆడపూరు గ్రామ పంచాయతీ పరిధిలో దిగువ హరిజనవాడలో సీతారాముల విగ్రహాలతో పాటు లక్ష్మణ, హనుమంతుల వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ గడికోట ఉషారాణి దంపతులు సహకారంతో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. వేద పండితులు వేదమంత్రాల నడుమ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు.

వలంటీర్లకు పురస్కారాలు

రామాపురం : మండలంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం గ్రామాలలో ఉత్తమ సేవలు అందించిన ఐదుగురు వలంటీర్లకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా సన్మానం, పురస్కారాలు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు యువరాజు, శరత్‌బాబు, రమేష్‌బాబు, స్వాతి, సుహాసినిలకు సేవా రత్న అవార్డులను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బ్రీత్ అనలైజర్ ప్రాజెక్టుకు రివార్డు

సిద్దవటం : శ్రీ భారతి హైస్కూల్ ఆటోమేటిక్ విద్యార్థిని పొట్టేటి హారిక తయారు చేసిన ఆల్కాహలిక్ బ్రీత్ అనలైజర్ ప్రాజెక్ట్‌కు రూ. 10వేలు రివార్డు లభించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.నిర్మలాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మద్యం సేవించిన వారు శ్వాస సంబంధిత పరికరం ద్వారా కనుగొని వారు వాహనం నడపడానికి ప్రయత్నిస్తే పరికరం ఇంజన్ డీసీ మోటర్‌ను ఆపేస్తుందన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థిని హారికను అభినందించారు.

అట్టహాసంగా ప్రచార పర్వం

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి దోహదం చేద్దాం
- సాయిబాబా గుడిలో పూజలు చేసి..
- ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా



ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్న ఆకేపాటి, మేడా, నాయకులు



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట రూరల్ : ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని జెడ్పీ చైర్మన్, రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు ఓటర్లను కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ప్రచార వేడుకలను ప్రారంభించేందుకు రామ్‌నగర్‌కు విచ్చేసిన ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలాభిషేకం చేస్తూ, బాణసంచా పేలుస్తూ ఘనస్వాగతం పలికారు. జోహార్ వైఎస్సార్.. జై జగనన్న.. అంటూ నినదించారు. ముందుగా రామ్‌నగర్‌లోని సాయినాథుని ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రచార పర్వంలో పాల్గొన్నారు. అందరి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకుందామని పిలుపునిచ్చారు. వేడుకలలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్ కుమార్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు



రాయచోటి అర్బన్: వీరభద్రాలయం వద్ద స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్, కార్యదర్శులు



సంబేపల్లె: నల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు చేయిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

రాయచోటి అర్బన్ : పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వీరభద్రాలయం వద్ద మలాథియన్ స్ప్రేయింగ్ పనులతోపాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జునతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నీరు నిలువ ఉండే ప్రాంతాల్లో దోమలు అధిక సంఖ్యలో ఉత్పత్తయ్యే అవకాశం ఉందన్నారు. అలాంటి ప్రాంతాలను కార్మికులు గుర్తించి వెంటనే నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, మలాథియన్ స్ప్రే చేయడం లాంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వార్డు పరిధిలో ఎక్కడైనా అపరిశుభ్ర వాతావరణ ఉంటే ప్రజలు సమాచారాన్ని వెంటనే వార్డు పర్యావరణ కార్యదర్శికి తెలియచేయాలంటూ చెప్పారు. ప్రజలు కూడా తమ ఇంటి ఆవరణంలో, కుండలు, నీటితొట్టెలలో నీరు ఎక్కువరోజులు నిలువ ఉంచుకోరాదంటూ తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు పర్యావరణ కార్యదర్శులు రామ్మోహన్ రెడ్డి, శివరంజని పాల్గొన్నారు.

నల్లగంగమ్మ సన్నిధిలో కమిషనర్

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ అద్భుత శక్తులు, మహత్యం గల తల్లి అని రాయచోటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సంబేపల్లెలోని నల్లగంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు కమిషనర్ శ్రీనివాసరావుకు తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. పూజారులు ఆలయ చరిత్ర, దేవరరాయి మహిమలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట వైస్ ఎంపీపీకి ఘన నివాళి



అంతిమయాత్రకు హాజరైన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందిన వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్ రెడ్డికి పార్థివ దేహానికి శుక్రవారం ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళి అర్పించారు. శుక్రవారం స్వగ్రామనికి చేరిన వైస్ ఎంపీపీ మృతదేహానికి రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, పెన్నా సిమెంట్ అధినేత వేణుగోపాల్ రెడ్డిలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి సేవలు ఎనలేనివన్నారు. 2019 ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించారన్నారు. గెడ్డం మరణం పార్టీకి తీరనిలోటని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే మేడా కుటుంబ సభ్యులు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గజ్జల శ్రీనివాసులు రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

ఒంటిమిట ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో వైస్ ఎంపీపీ జనార్దన్ రెడ్డి చిత్రపటానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఈఓపీఆర్‌డీ కుమార్ గంగయ్య, నాయకులు, కార్యకర్తలు, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు. అనంతరం వారు జనార్దన్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

మైనర్లు వాహనాలు నడిపితే శిక్షలు తల్లిదండ్రులకే



మాట్లాడుతున్న సీఐ మహబూబ్ బాషా

రాయచోటి టౌన్ : మైనర్లు వాహనాలు నడిపితే అందుకు శిక్షలు తల్లిదండ్రులు అనుభవించాల్సిందేనని రాయచోటి ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా వాహనదారులకు తెలియజేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని పలు ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో వాహనాల రికార్డులు పరిశీలించారు. అలాగే మైనర్లుగా ఉన్న వారు వాహనాలు నడిపితే శిక్షలు తల్లిదండ్రులు అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. భారీ జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే వాహనం బయటికి తీసుకొచ్చే సమయంలో అందుకు తగిన రికార్డులు అన్నీ సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి రికార్డులు లేకపోయినా వెంటనే సమకూర్చుకోవాలని చెప్పారు.

మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయాన్ని సందర్శించిన ఈఓ కొండారెడ్డి

గాలివీడు : మండలంలోని గుండ్లచెరువు మల్లేశ్వర స్వామి శివాలయం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని ఈఓ కొండారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుండ్లచెరువు గ్రామంలోని దుర్గమ్మ చెరువు దగ్గర వెలసిన అతి పురాతనమైన మల్లేశ్వరస్వామి శివాలయాన్ని గ్రామస్తులతో కలిసి సందర్శించారు. మాట్లాడుతూ ఇప్పటికే దేవాదాయ శాఖ పరిధిలో ఈ ఆలయం ఉన్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయం చుట్టూ గత వారం రోజుల నుంచి గ్రామస్తులు, యువత పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఆయన వెంట గాలివీడు పెద్దూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వృథాగా వెలిగల్లు నీరు



గోరాన్‌చెరువు సమీపంలో వృథాగా పోతున్న నీరు

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ ద్వారా రాయచోటి దాహార్తిని తీరుస్తోంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పలు చోట్లు నీరు వృథా అవుతున్నప్పటికీ చర్యలు చేపట్టడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. గత రెండు రోజుల నుంచి గాలివీడు – రాయచోటికి వెళ్లే పైప్‌లైన్ మార్గ మధ్యలోని గోరాన్‌చెరువు ఆంజనేయస్వామి ఆలయం మలుపు వద్ద ఏర్పాటు చేసిన హెయిర్ వాల్ నుంచి నీరు వృథా అవుతోంది. అధికారులు మరమ్మతులు చేపట్టి నీటిని ఆదా చేయాలని గ్రామస్తులు కోరారు.

బాధ్యతల స్వీకరణ

రామాపురం : మండల తహసీల్దార్‌గా ఏ.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా నుంచి రాయచోటి అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా రథసప్తమి పూజలు

సిద్దవటం : రథసప్తమిని పురస్కరించుకొని మండలంలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. కొత్తమాధవరంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకం, అలంకరణతోపాటు పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మల్లూరు గ్రామంలో వెలసిన మల్లూరమ్మ ఆలయంలో రథసప్తమి పూజలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహశీల్దార్ ఇంద్రాణి తనిఖీ చేశారు. నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లి, బెస్తపల్లి, ఓబిలి, సింగారెడ్డిపల్లి, సిద్దవరం పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కుమార్ స్వామి, ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సిద్దవటం : కడపాయపల్లి హరిజనవాడలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక మండల అధ్యక్షుడు బి. శివకుమార్ డిమాండ్ చేశారు. సిద్దవటంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య, వీధుల్లో చెత్త పేరుకుపోయిందన్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



పుల్లంపేట: రంగంపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శేఖర్

సిద్దవటం : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరంలాంటిదని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామ సచివాలయంలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టక్కోలి సచివాలయం పరిధిలో ఉన్న లింగంపల్లి, కడపాయపల్లి, దేగనవాండ్లపల్లి, ఖాజీపల్లె గ్రామాలకు చెందిన 305 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. గ్రామాల్లోని వ్యాధి గ్రస్తులందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్ వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి శివయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట మండలం రంగంపల్లెలో..

పుల్లంపేట : మండల పరిధిలోని రంగంపల్లె సచివాలయం నందు శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సానే శేఖర్, డాక్టర్ మనోజ్ చంద్రల ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు వైద్య సేవలు అందించనున్నారన్నారు. వృద్ధులకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాలు 1.60 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టండి



లక్కిరెడ్డిపల్లె: సబ్ స్టేషన్‌ను సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఎస్.రమణ

లక్కిరెడ్డిపల్లె : విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. మండలంలోని 33/11 సబ్‌స్టేషన్‌ను, లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల విద్యుత్ కార్యాలయ సిబ్బంది, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పగటిపూట వీధిలైట్లు వెలగకుండా ప్రతిభ కనబరిచిన జేఎల్‌ఎంలను సత్కరించారు. సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. సంస్థపై ప్రజలలో సంతృప్తి స్థాయిని పెంచే విధంగా ప్రతి ఉద్యోగి పని చేయాలన్నారు. ఫిర్యాదులపై సిబ్బంది వెంటనే స్పందించాలని సూచించారు. మరమ్మతులు అవసరమైనచోట వేగంగా పనులు చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు, సస్పెన్షన్లు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో రాయచోటి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్ రెడ్డి, ఏఈలు, అకౌంట్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

రామాపురం : నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని విద్యుత్ ఎస్‌ఈ రమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండల విద్యుత్ శాఖాధికారుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం సమీపించడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీఏ విజయకుమార్‌రెడ్డి, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగులు నిరసనన ప్రదర్శన చేశారు. శుక్రవారం రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) పిలుపు మేరకు శుక్రవారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జేఏసీ నేతలు ప్రసాద్ యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, జాబీర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు నాలుగు సంవత్సరాల నుంచి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, మిగిలిన డిమాండ్‌లను కూడా వెంటనే పరిష్కరించాలంటూ కోరారు. లేనిపక్షంలో 17న ఎన్‌జీఓ కార్యాలయం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 20వ తేదీన జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ధర్నా చేస్తామన్నారు. 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలు మహమ్మద్‌బాషా, శ్రీనివాసులు, దేవేంద్ర, ప్రమీలమ్మ, శివారెడ్డి, జయరామయ్య, రామక్రిష్ణ యాదవ్, అంకం జయచంద్రారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు వెంకటరమణ, వీరనాగిరెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌తో బానిసలుగా కార్మికులు

- రైతు ఆత్మహత్యలకు ప్రధాని మోడీ విధానాలే కారణం
- కనీస మద్దతు ధర చట్టాన్ని కేంద్రం తీసుకురావాలి
- గ్రామీణ రైతుబంద్‌లో పాల్గొన్న వామపక్ష, కార్మిక, రైతు సంఘాల నేతలు



విధులకు హాజరైన ఏపీఎండీసీ ఉద్యోగులు



రాయచోటి అర్బన్: బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన కార్మికులు



రాజంపేటలో వామపక్షాల ర్యాలీ

రాయచోటి అర్బన్ : రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే కనీస మద్దతు ధర చట్టాన్ని చేయాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చాలోని రైతు, కార్మిక సంఘాలు ఇచ్చిన గ్రామీణ బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం రాయచోటిలో వామపక్షాల అనుబంధ సంఘాల నేతలు బంద్‌ను చేపట్టారు. సమ్మెలో భాగంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు, కార్మికులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం బస్టాండు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన పోస్టాఫీసు, ఎల్‌ఐసీ, బ్యాంకులను మూసివేయించారు. ఈ సందర్భంగా నేతలు సాంబశివ, రామాంజులు, విశ్వనాథనాయక్, రంగారెడ్డి, రామచంద్ర, క్రిష్ణప్ప, ఏ.వి.రమణలు మాట్లాడుతూ మోడీ హయాంలో అనుసరించిన విధానాల కారణంగా రూ.12లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలు మాఫీ జరిగితే, గిట్టుబాటు ధర లభించక రుణాలను చెల్లించలేని లక్షలాది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కనీస మద్దతు ధరను చట్టం చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ మాట తప్పి రామాలయం వెనుక దాక్కున్నారంటూ ఎద్దేవా చేశారు. పరిశ్రమల్లో తయారయ్యే ప్రతి వస్తువుకు ఎమ్మార్పీ ఉన్నప్పుడు రైతులు పండించే పంటలకు మ్యాగ్జిమమ్ సపోర్ట్ ప్రైజ్ ఎందుకు ఇవ్వరంటూ వారు ప్రశ్నించారు. కార్మికులకు బాసటగా ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను నయా బానిసలుగా మార్చాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు సిద్దమ్మ, నాగమణి, సబీనా, సరస్వతి, భూదేవి, రాంబాబు, చెన్నయ్య, మాధవయ్య, శేఖర్‌నాయక్, శ్రీనివాసులు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీలో నామమాత్రంగా సమ్మె

ఓబులవారిపల్లె : దేశ వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన కార్మిక, రైతుల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ మంగంపేట ఏపీఎండీసీ పరిపాలన భవనం ఎదుట తెల్లవారుజామున జేఏసీ కార్మిక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గనులలో పనుల(డిస్‌ప్యాచ్)ను అడ్డుకున్నారు. అయితే మంగంపేట పునరావాస కార్మిక సంఘం నాయకులు సమ్మెకు దూరంగా ఉన్నారు. మంగంపేట ఏపీఎండీసీలో సమ్మె ప్రభావం లేదని, తొంభై శాతం పనులు యథావిధిగా జరిగినట్టు సీపీఓ సుదర్శన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ర్యాలీ

చిట్వేలి : సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తప్పుబడుతూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, సీఐటీయూ మండల కార్యదర్శి సుజాత, ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిద్దు, మల్లి, చిన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన ర్యాలీ

రాజంపేట రూరల్ : కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త బంద్ – పారిశ్రామిక సమ్మెలో భాగంగా వామపక్ష నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ వద్ద నుంచి మొదలైన ఈ ర్యాలీ పాత బస్టాండులోని వైఎస్సార్ సర్కిల్ మీదుగా జాతీయ రహదారి మీద నున్న ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ నిరసన తెలియజేశారు. ర్యాలీలో ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్ రాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శివరామకృష్ణదేవర, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర, సికిందర్‌లతో నాయకులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

ఒంటిమిట్ట : గ్రామీణ బంద్ సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఆయా సంఘాల బీకేఎంయూ ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు కె.నరసయ్య, కె.యానాదయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తుందన్నారు. కార్యక్రమంలో సురేష్ బాబు, సాంబయ్యలు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక నల్లచట్టాలు రద్దు చేయాలి

సంబేపల్లె : కార్మిక, కర్షక, ఉద్యోగ ప్రజా సమస్యల మీద దేశవ్యాప్తంగా జరిగిన గ్రామీణ పారిశ్రామిక బంద్ సంబేపల్లెలో రైతు సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురు రామచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతు కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని, వ్యవసాయ నల్ల చట్టాలు, విద్యుత్ స్మార్ట్ మీటర్‌లను వ్యవసాయ పంపుసెట్లకు బిగించడం విరమించుకోవాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి కార్మిక సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారుకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు జి భాస్కర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు అనుసూయమ్మ, శ్రీలత, ఫర్హానా చాందినీ, వెంకటసుబ్బమ్మ, జయలక్ష్మి, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.